మద్యం షాపులు బంద్

అమలాపురంటౌన్/యానాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో మద్యం షాపులు, బార్లు మూసివేయాలని జిల్లా ఎన్నికల అధికారి మంగళవారం ఆదేశాలు జారీచేశారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి గురువారం సాయంత్రం 4 గంటల వరకు మద్యం డిపోలు, దుకాణాలు, బార్‌లు మూసి ఉంచాలన్నారు. కాగా రెండు రోజులపాటు యానాంలో మద్యం షాపులూ మూసివేయనున్నట్టు పుదుచ్చేరి డిప్యూటీ ఎక్సయిజ్ కమిషనర్ తెలిపారు.

రేపు టీచర్స్ ఎమ్మెల్సీ పోరు

- ఉదయం 8 నుంచి పోలింగ్ - 16,737 మంది ఓటర్లు - 9న కౌంటింగ్


బి.గోపిమూర్తి


జి.నారాయణరావు


కె.నాగేశ్వరరావు


పులుగు దీపక్


ఎన్.వెంకటలక్ష్మి

కలెక్టరేట్ (కాకినాడ)/ రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల పోలింగ్ గురు వారం జరగనుంది. గత ఎన్నికల్లో యూటీఎఫ్ తరపున గెలిచిన షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరగనున్నాయి. ఐదుగురు అభ్యర్థులు స్వతంత్రంగా బరిలో ఉండడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. యూటీఎఫ్ నేత బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు, డాక్టర్ కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, నామన వెంకటలక్ష్మి (విళ్ల లక్ష్మి) పోటీ పడుతున్నారు. కానీ ప్రధాన పోటీ ఇద్దరి మధ్యే ఉంటుందని పరిశీలకులు అంచనా. ఇంతవరకూ ప్రచారం హోరాహోరీగా సాగింది. మంగళవారం సాయంత్రం 4 గంటలతో ప్రచారం ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. 16,737 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాకినాడ జిల్లాలో 3418 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2990, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3296, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 637, పశ్చిమగోదావరి జిల్లాలో 3729, ఏలూరు జిల్లాలో 2667 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను సురక్షితంగా కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నారు. ఈనెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారు. ఈనెల 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులు, ఇతర సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధ, గురువారాలు 144 సెక్షన్ అమల్లోకి తెచ్చారు. తూర్పుగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు డీఆర్వో సీతారామమూర్తి తెలిపారు.

ఎన్నిక ప్రశాంతంగా జరగాలి
కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నిక స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో అన్ని మండలాల తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారత ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఓటు వేసేందుకు క్యాజువల్ లీవ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఈ నియోజకవర్గ ఉపాధ్యాయ ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు తగు వెసులుబాటు కల్పిస్తూ విధులకు ఒక గంట ఆలస్యంగా హాజరయ్యేందుకు, షిఫ్ట్‌ల అడ్జస్ట్‌మెంటు అనుమతించాలన్నారు.

నేటి నుంచి పెళ్లిళ్ల సందడి

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం కావడంతో పెళ్లిళ్ల సందడి మొదలైంది. బుధవారం నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభమై ఈనెల 15 వరకు ఉంటాయని పురోహితులు చెబుతున్నారు. దీంతో డిసెంబర్ నెలంతా పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగనున్నాయి. జిల్లాలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలతోపాటు కల్యాణ మండపాలు, ఆలయ మండపాల్లో పెళ్లిళ్లు చేసుకోవాలనుకునేవారు ఇప్పటికే మండపాలు బుక్ చేసుకున్నారు. పెళ్లి మండపాల అలంకరణల దగ్గర నుంచి భోజన ఏర్పాట్లు వరకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. అటు మార్కెట్‌లోనూ సందడి మొదలైంది.

సాహసం సాగరం



నావికాదళ విన్యాసాలకు కేంద్రంగా కాకినాడ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ సాగరం రక్షణపరంగా తూర్పు నావికా దళానికి అత్యంత కీలకం. గడచిన కొన్నేళ్లుగా కాకినాడ సముద్ర జలాల్లో ఇండియన్ నేవీ పలు రకాల మాక్‌డ్రిల్స్, ఎక్సర్‌సైజ్‌లతో భద్రతను పటిష్టం చేస్తోంది. ఈ మేరకు అమెరికన్ నేవీతో సైతం పలు రకాల ప్రత్యేక ఉమ్మడి విన్యాసాలు చేస్తూ తీరాన్ని, సముద్రజలాల సరిహద్దును కంటికి రెప్పలా కాపాడుతోంది. వాస్తవానికి నావికాదళం అంటే విశాఖలోని తూర్పునావికాదళ స్థావరంగా చెబుతారు.దీని పరిధిలో కాకినాడ సాగరం కూడా ఉండడంతో గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో వ్యూహాత్మక రక్షణ చర్యలు చేపడుతోంది. నేడు భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రతి ఏడాది విన్యాసాలు..

2022 అక్టోబరులో భారత నేవీ ఆఫ్‌షోర్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్‌ను ప్రస్థాన్ పేరుతో నిర్వహించింది. నౌకల్లోకి నేవీ విమానాలు ఎగురుకుంటూ వచ్చి భద్రత చర్యలు చేపట్టడం, బాంబులు పసిగట్టడం వంటి వాటిపైనా, నిపుణులను రక్షించి తీసుకువెళ్లడంపై మాక్‌డ్రిల్ నిర్వహించింది.2023 జనవరిలో ఆర్మీ,నేవీ,ఎయిర్‌ఫోర్స్ కలిపి కాకినాడలో యాంపెక్స్-2023 నిర్వహించాయి. తీరంలోను సముద్రంలోపల విదేశీ శక్తులు, ఉగ్రవాదులు చొరబడితే వారిని మట్టుపెట్టడం ఎలా? రక్షణ విషయంలో ఎలా చురుగ్గా వ్యవహరించాలి? వ్యూహాల అమలు..వంటివాటిపై ఎక్సర్‌సైజ్ చేపట్టాయి. 2023 ఏప్రిల్‌లో సముద్రంలో చమురు కార్యకలాపాల వల్ల సాగర జలాలు కాలుష్యం నేపథ్యంలో వాటిని ఎలా సంరక్షించుకోవాలి? సముద్రంలో బోట్లు, షిప్పుల్లో జరిగే అగ్నిప్రమాదాల సమయంలో ఆస్తినష్టం తగ్గించుకుంటూ అందులో ఉన్న వారిని కాపాడుకోవడం ఎలా? అనే దానిపై నేవీ విన్యాసాలు నిర్వహించింది. నౌకల్లోంచి నేవీ సిబ్బంది ప్రమాద ఘటనలో ఇతర నౌకల్లో మంటలను అదుపు చేయడం, అందులోని సిబ్బందిని ప్రత్యేక బాక్సుల్లో ఈదుకుంటూ వెళ్లి రక్షించడం, హెలీకాప్టర్ల నుంచి తాడుతో దిగి వారిని కాపాడడం వంటి వాటిని సాహసోపేతంగా చేసి చూపించింది. అదే ఏడాది అక్టోబరులో చమురుసంస్థలు, కోస్ట్‌గార్డ్,కస్టమ్స్ తో కలిపి రక్షణ చర్యలు చేసి చూపించింది. నేవీకి చెందిన ఐఎన్ ఎస్ కోర,ఐఎన్ఎస్ టిహాయులు మెరైన్ కమాండోలతో కలిపి బాంబు డిస్పోజబుల్ నిపుణులు ప్రమాదాల సమయంలో ఏవిధంగా దేశ తీరజలాలను కాపాడుకోవాలో చేసి చూపించాయి.ఈ ఏడాది సెప్టెంబరులో కాకినాడలో తూర్పు నావికాదళం 47వ ప్రాంతీయ సదస్సు ఇక్కడే నిర్వహించింది. ఏటా అమెరికన్ నేవీతో కలిసి విన్యాసాలు చేస్తూ కాకినాడ తీరం,సముద్ర జలాల సరిహద్దుల్లో గస్తీ పెంచి విశేష సేవలందిస్తోంది.

దేశానికి ఆయువుపట్టు కేజీ బేసిన్

ప్రధానంగా కాకినాడ తీరం నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీ బేసిన్ దేశానికి అతిపెద్ద ఆయువుపట్టు. సముద్రం మధ్యలో 50 వేల చదరపు కిలో మీటర్లకుపైగా విస్తరించి ఉన్న బేసిన్‌లో 2003 నుంచి 26 బావుల్లో చమురు,గ్యాస్‌ను ఓఎన్‌జీసీ, రిలయన్స్, కెయిన్ ఎనర్జీ వంటి ప్రఖ్యాత కంపెనీలు తవ్వుతున్నాయి. లక్షల కోట్ల పెట్టుబడులతో వందలాది మంది నిపుణులు, సిబ్బంది.. పదుల సంఖ్యలో నౌకల్లో ఉంటూ ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీని రక్షణ భారత తూర్పు నావికాదళం పర్యవేక్షిస్తోంది. కేజీ బేసిన్‌లో అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు జరిగినా, విద్రోహశక్తులు కన్నేసినా దీన్ని ఎలా రక్షించుకోవాలి? అనేదానిపై ప్రతి ఏటా ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది మార్చిలో అమెరికన్ నేవీతో కలిసి ఈసారి విన్యాసాలు చేసేందుకు మన ఇండియన్ నేవీ అధికారులు సన్నద్ధమవుతున్నారు.



- కేజీ బేసిన్‌లో చమురు,గ్యాస్
- లక్షల కోట్లతో నిక్షేపాలకు అన్వేషణ
- కీలకంగా మారిన భద్రత
- ఎప్పటికప్పుడు నేవీ నిఘా
- ప్రతి ఏటా ప్రస్థాన్ పేరిట మాక్‌డ్రిల్
- రక్షణ చర్యలపై అవగాహన
- వచ్చే ఏడాది మార్చిలో విన్యాసాలు
- నేడు భారత నౌకాదళ దినోత్సవం

సిద్ధమైతే.. అద్భుతమే!


కాకినాడ బీచ్‌లో సిద్ధమవుతున్న మ్యూజియం

కాకినాడలో టీయూ-142ఎం యుద్ధ విమాన మ్యూజియం

సర్పవరం జంక్షన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన కాకినాడ బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియం త్వరలో సందర్శకులకు వినోదం, విజ్ఞానం అందించనుంది. దేశ భద్రత,రక్షణ కోసం త్రివిధ దళాలు అందిస్తున్న సేవలు, రక్షణ రంగంలో టీయూ-142 ఎం యుద్ధ విమానం అందించిన సేవలను మ్యూజియం రూపంలో థీమ్‌పార్కు పేరిట కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో 2020లో రూ.5.89 కోట్ల గుడా నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రెండెకరాల స్థలంలో టీయూ-142 విమాన మ్యూజియం నిర్మాణం పనుల టెండర్‌ని తెనేజా ఏరో స్పేస్ లిమిటెడ్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇంకా యుద్ధ విమానం లోపల ఏసీ, విద్యుద్దీకరణ, లైటింగ్ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఆయుధాల నిల్వ, వాటిని ఏవిధంగా ప్రయోగిస్తారు, విమాన టేకాఫ్, ల్యాండింగ్ తదితర వివరాలు, దేశానికి అందించిన సేవలు, డిస్‌ప్లే, వీడియో, ఆడియో తదితర సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానంపై సమాచారం ఏర్పాటు చేయాల్సి ఉంది. మ్యూజియంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలిస్తే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. కానీ ఇవన్నీ పూర్తయితే మ్యూజి యం సందర్శకులకు కనువిందు చేయనుంది. ఇది ఎప్పుడు పూర్తవుతుందా అని జనం ఎదురుచూస్తున్నారు.

యుద్ధ విమానం ప్రత్యేకతలివే..

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా దేశం నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో ఇది విశేష సేవలు అందించింది. ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచదేశాలను కేవలం 16 గంటల్లో చుట్టివచ్చే సామర్థ్యం దీని సొంతం. ఇది గంటకు 925 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు .దీని బరువు 90 వేల కిలోలు. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142ఎం ఎయిర్‌క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28 ఏళ్లపాటు దేశానికి విశేష సేవలు అందించింది. సముద్ర తీర గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో ఖ్యాతి గడించిన ఈ యుద్ధ విమానం 2017లో నేవీ నుంచి వైదొలిగి, తమిళనాడులోని అరక్కోణం బేసల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విమానాన్ని తమిళనాడు నుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా తెనేజా ఏరో స్పేస్ లిమిడెట్ సంస్థ తీసుకువచ్చింది.

రేషన్ మాఫియాపై మరింత నిఘా

- అదనపు చెక్‌పోస్టులు
- రేయింబవళ్లు తనిఖీ చేసే విధంగా ఉద్యోగులకు షిఫ్ట్‌లు
- ప్రత్యేక తనిఖీలకు ఐదు ప్రభుత్వ శాఖలతో కమిటీ
- నేడు స్టెల్లా ఎల్ నౌకలో తనిఖీలకు బృందం
- ఉదయం 8.30 గంటలకు బయలుదేరుతున్న బృందం

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియాను ఉక్కుపాదంతో మోపేందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధంచేసింది. ఈ నేపథ్యంలో పోర్టులో మరింత నిఘా పెంచింది. అదనపు చెక్‌పోస్టులు ఏర్పాటుతోపాటు రేయింబవళ్లు తనిఖీలు చేసే విధంగా ఉద్యోగులను మూడు షిఫ్ట్‌ల్లో నియమిస్తోంది. కాకినాడ యాంకరేజ్ నుంచి పీడీఎస్ బియ్యం రవాణా చేయకుండా ఉండేందుకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. పోర్టులో బొంబాయి కాటా, శక్తిగ్యాస్‌ల వద్ద ఉన్న రెండు చెక్‌పోస్టుల్లో 24 గంటలపాటు తనిఖీలు ఉండే విధంగా మూడు షిఫ్ట్‌ల్లో ఉద్యోగులను నియమిస్తున్నారు. ప్రతిరోజు వెయ్యి నుంచి 1100 లారీలు బియ్యం లోడ్‌తో కాకినాడ పోర్టుకు వస్తాయి. బియ్యం లారీల్లో ప్రతి ఒక్క బస్తాను తనిఖీ చేసి అక్కడకక్కడే శాంపిల్స్ పరీక్షించే యంత్రాంగాన్ని ఏర్పాటుచేస్తున్నారు. జూన్ నెలలో మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీ చేసిన తర్వాత జూలై నెలలో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు తొలుత ఈ చెక్‌పోస్టులు సజావుగా నడిచినప్పటికీ తర్వాత క్రమంలో పగటిపూట పనిచేసి రాత్రి లారీలను తనిఖీలు చేయకుండా వదిలేశారు. దీంతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా యథావిధిగా జరిగింది. ఇటీవల కలెక్టర్ స్టెల్లా ఎల్ నౌకలో తనిఖీలు చేయడం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనిఖీలకు పోర్టుకు రావడంతో తనిఖీల్లో డొల్లతనం బయటపడింది. దీంతో అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం చెక్‌పోస్టులను బలోపేతం చేయడంతో పాటు అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెవెన్యూ, పోలీసు, సివిల్ సప్లయిస్, పోర్టు, కస్టమ్స్ అధికారులతో మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నిత్యం పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను నిరోధించే విధంగా ప్రత్యేక అధికారాలు ఇచ్చారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా సమాచారం అందిన వెంటనే ఈ కమిటీ తనిఖీలు చేస్తుంది. పీడీఎస్ బియ్యంగా గుర్తిస్తే సీజ్ చేస్తారు. ఇక బుధవారం ఉదయం 8.30 గంటలకు సముద్రంలో ఉన్న స్టెల్లా ఎల్ నౌకలోకి నూతనంగా ఐదు ప్రభుత్వ శాఖల అధికారులతో నియమించబడిన మల్టీ డిసిప్లినరీ కమిటీ వెళ్లనుంది. నౌకలో ఉన్న బియ్యాన్ని సమగ్రంగా తనిఖీ చేసి నివేదికను ప్రభుత్వానికి అందించనుంది. మరోవైపు పోర్టులో ఉన్న ఐదు సార్టెక్స్ మిల్లులపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఆ మిల్లులు ఎలాంటి అనుమతులు తీసుకుని నిర్వహిస్తున్నారు. ఐదు మిల్లులు ఎప్పటి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి, ఆయా మిల్లుల్లో పీడీఎస్ బియ్యం పాలిష్ చేసి ఏ మేరకు విదేశాలకు పంపిస్తున్నారు వంటి అంశాలను తనిఖీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గత ఐదేళ్లపాటు ఈ సార్టెక్స్ మిల్లుల్లో పెద్దఎత్తున పీడీఎస్ బియ్యం పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆ దిశగానూ కూపీ లాగుతున్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నియంత్రించాలి : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణపాటు రీసైక్లింగ్, పీడీఎస్ బియ్యం తయారీ పంపిణీ వంటి అంశాలపై అధికారులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ రాహుల్‌మీనాతో కలిసి పౌరసరఫరాలశాఖ అధికారులు, పోలీసు అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. బియ్యాన్ని ఎలా తనిఖీ చేయాలి, శాంపిల్స్ ఎలా తీయాలి, దాన్ని ఎలా పరీక్షించాలి, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని పీడీఎస్ బియ్యంగా మార్చడంలో ఉన్న దశలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను నియంత్రణకు తనిఖీలు సమర్థంగా నిర్వహించాలన్నారు. వర్క్‌షాప్‌లో ఇన్చార్జి డీఎస్‌వో లక్ష్మీప్రసన్నదేవి, పౌరసరఫరాల సంస్థ అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు

ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే
మనిషి మనుగడ

- డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు
- ఘనంగా జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్

కాకినాడ రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని కాకినాడ డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్-2024 కార్యక్రమాన్ని ఏపీఎన్‌జీసీ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ, ఏపీఎన్‌జీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని కాపాడేందుకు మన జీవనవిధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలను డీవైఈవో పరిశీలించారు. పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 56 పాఠశాలలకు చెందిన 187 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎం ఎంఎస్ సుబ్రహ్మణ్యం, ఏపీఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త కేవీకే మహేశ్వరరావు, పిల్లి గోవింద రాజులు, సమన్వయ కర్తలు రమణమూర్తి, వీరభద్రరావు, ఎంఈవో రవి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌వినీల్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న డీవైఈవో



శబరి లంకలో సాగు చేస్తున్న పొగాకు



పాకల్లో ఆరబెట్టిన పొగాకు (ఫైల్)

ఇది శబరి లంక పొగాకు

- ఒక్క చింతూరు డివిజనుకే సొంతం
- పాత తరం ధూమపాన ప్రియులకు కిక్కు
- ఏజెన్సీలో మూడు వేల ఎకరాల్లో సాగు
- మూడు వేలమందికి పైగా ఉపాధి





పొగాకు కోస్తున్న మహిళా కూలీలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి - చింతూరు)

శబరి లంక పొగాకు.. పాతతరం ధూమపాన ప్రియులు అమితంగా ఇష్టపడే లంక చుట్టల తయారీకి వినియోగించే పంట ఇది. రెండు తెలుగు రాష్ట్రాల మొత్తంలోనూ ఒక్క చింతూరు డివిజనుకే ఈ సాగు సొంతం. గోదావరి, శబరి నదీ పరీవాహకం ఈ సాగుకు అనుకూలం. కాగా గోదావరి లంకల్లో కంటే శబరి లంకల్లో పండించిన పొగాకుకే డిమాండ్ అధికం. దీంతో విక్రయ ధర కూడా ఎక్కువే. దీనికి శబరి జలాలే కారణమని రైతులు చెబుతున్నారు. శబరి నీరు సహజసిద్ధంగా తీయదనం కలిగి ఉంటుంది. ఆ నీటిని సాగుకు వినియోగించడంతో చుట్టలు రుచికరంగా ఉంటాయని ధూమపాన ప్రియులు, వ్యాపారస్తులు చెబుతుంటారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో ఈ సాగు అధికం. స్థానిక రైతులే కాకుండా రాజమండ్రి పరిసర ప్రాంత కౌలు రైతులు కూడా ఇక్కడికొచ్చి సాగుచేస్తున్నారు. ఒక్క ఎకరా లంక కౌలు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతుంది. అక్టోబరులో సాగు మొదలై ఫిబ్రవరి నెలాఖరుకల్లా విక్రయ లావాదేవీలన్నీ ముగిసిపోతుంటాయి. అన్నీ అనుకూలిస్తే రైతు ఇంట కాసుల పంటే. ప్రతికూల పరిస్థితులు ఎదురైతే నష్టాలు తప్పవు. ఒక ఎకరా సాగు చేయాలంటే రూ.లక్ష నుంచి నుంచి రూ.లక్షా 20వేల వరకు పెట్టుబడి అవసరం. ఎకరాలో గరిసెన్నర వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కాలం కలిసొస్తే రెండు గరిసెల వరకు కూడా దిగుబడి వచ్చే అవకాశం లేకపోలేదు. మొక్క నాటిన నుంచి 105వ రోజుకు ఆకు పరిపక్వత దశకు చేరుతుంది. తర్వాత ఆకు కోసి తాత్కాలిక పాకల్లో నెలరోజుల పాటు ఆరబెట్టాల్సి ఉంది. అనంతరం 24 కేజీల వంతున ఒక్కో తాటాకు బుట్టల్లో నిల్వ చేస్తుంటారు. అటువంటి 30 బుట్టల పొగాకును కలిపితే ఒక గరిసెగా లెక్కిస్తుంటారు. గరిసె పొగాకు ధర రూ.లక్ష నుంచి రూ.లక్షా 50వేల వరకు ఉం టుంది. చింతూరు డివిజనులో పండించిన పొగాకును రాజమండ్రి పరసర ప్రాంతాలైన ములకల్లంక, సీతానగరం, చివిడిలంక, కొత్తపేట తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. కాగా గతేడాది గుంటూరుకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ రంగంలోకి దిగింది. విదేశాలతో ఒప్పందం కుదుర్చుకున్న ఆ కంపెనీ శబరి లంకల్లో పండించిన గరిసె పొగాకును రూ.2 లక్షల 30 వేల వరకు ధర వెచ్చించి కొనుగోలు చేసింది. ఇదొక చరిత్రగా రైతులు అభివర్ణిస్తున్నారు. అంతేకాదు ఈ ఏడాది కూడా తామే కొనుగోలు చేస్తామని సదరు కంపెనీ రైతులతో ఒప్పందం చేసుకుంది. ఆ కంపెనీ ఇతర దేశాలకు శబరి లంక పొగాకును ఎగుమతి చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగింది.



క్రిస్మస్ 'ట్రీ'

లూథర్‌గిరిలో ఆకట్టుకుంటున్న స్టార్స్‌తో అలంకరించిన చెట్టు

క్రిస్మస్ సందడి ఆరంభమైంది. చర్చిలు, క్రైస్తవ మిషనరీ సంస్థల కార్యాలయాలు, క్రైస్తవ సోదరుల గృహాలను విద్యుద్దీపాలతో అలంకరణలు చేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, ధవళేశ్వరం, అనపర్తి, కోరుకొండ, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పురాతన చర్చిలను ముస్తాబు చేశారు. రాజమహేంద్రవరంలోని పురాతన చర్చ్ సెయింట్ పాల్స్, సెయింట్ పీటర్, లూథర్‌గిరి చర్చిలు సందడిగా మారాయి. లూథర్‌గిరిలో ఒక చెట్టుకు స్టార్లను ఏర్పాటుచేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం సిటీ



హెచ్‌సీ అబ్రహంకు ప్రసంసాపత్రం అందిస్తున్న దీపిక

కాంస్య పతకం సాధించిన ఏపీఎస్పీ హెచ్‌సీ అబ్రహం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల నాగాలాండ్ రాష్ట్రం ధీమాపూర్‌లో నిర్వహించిన 25వ అఖిల భారత పోలీస్ బ్యాండు పోటీల్లో బిగిల్ కాల్ పోటీలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించిన ఏపీఎస్పీ హెడ్‌కానిస్టేబల్ ఎస్ అబ్రహాన్ని ఏపీఎస్పీ కమాండెంట్ ఎం. దీపిక అభినందించారు. మంగళవారం కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్‌లో అబ్రహాన్ని అభినందించి ప్రశంసాపత్రాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 24 టీమ్‌లు పాల్గొనగా ఏపీఎస్పీ.. ఏపీ పోలీస్ బిగిల్ టీం కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు పాల్గొన్నారు.

డ్రైవర్ చేతిలోకి గేర్ రాడ్!

ఏడీబీ రోడ్డులో ఘటన.. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు



రాజానగరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. సుఖమయం.. ఇది సంస్థ ట్యాగ్‌లైన్.. ఇటీవల ఆర్టీసీ బస్సులను చూస్తే మాత్రం ఎక్కడ ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంభయంగా ఉంటోంది.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. అదేదో సినిమాలో కామెడీ కోసం.. స్పీడ్‌గా వెళుతున్న బస్‌లో స్టీరింగ్ ఊడి చేతిలోకి వచ్చేస్తుంది.. అచ్చంగా ఇలాగే మంగళవారం వేగంగా వెళుతున్న ఒక ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు స్టీరింగ్ ఊడి చేతికి వచ్చేయడంతో అటు డ్రైవర్.. ఇటు ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. కాకినాడ జిల్లా తూర్పు గోదావరి జిల్లాల మధ్య ఉండే ఏడీబీ రోడ్డు గత ఐదేళ్లగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఎక్కడికక్కడ గోతులతో నిండి ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డు పనులు ఆరంభించినా ఇంకా పూర్తికాలేదు. ఆ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి ఏపీ 05 జడ్ 5247 ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు బయలుదేరింది. అందులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. నాన్‌స్టాప్ కావడంతో బస్ వేగంగా వెళుతోంది. 3.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం రామస్వామిపేట సమీపంలోకి వచ్చేసరికి పెద్ద గొయ్యి కనబడడంతో డ్రైవర్ స్లో చేద్దామని గేర్ రాడ్డుపై చేయి వేశాడు.. అంతే గేర్ రాడ్డు ఊడి చేతిలోకి వచ్చేసింది. దీంతో డ్రైవర్ హతాశుడయ్యాడు.. ఇది గమనించిన బస్సులోని ప్రయాణికులు భయంతో వణికిపోయారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును నెమ్మదిగా అదుపుచేసి రహదారి పక్కన నిలపడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్‌కు అభినందనలు తెలిపారు.

వాడపల్లి వెంకన్న కార్తీక ఆదాయం రూ.3.37 కోట్లు

ఈవో సూర్యచక్రధరావు వెల్లడి



ఆత్రేయపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని కార్తీక మాసంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. దీంతో అధిక ఆదాయం లభించింది. ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీకమాస ఆదాయం రూ.3,37,13,952 లభించిందని తెలిపారు. ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేదాశీర్వచనం, లడ్డూ విక్రయాలు, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవల ద్వారా ఈ మొత్తం లభించిందన్నారు. భక్తుల సౌకర్యార్థం మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

అన్నవరం దేవస్థానం పీఆర్వోగా కొండలరావు

పలువురికి అంతర్గత బదిలీలు

అన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం పీఆర్వోగా కె.కొండలరావును నియమిస్తూ ఈవో త్రినాథరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ క్యాడర్లలో 14మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇప్పటివరకు పీఆర్వోగా ఉన్న బీవీ రెడ్డికి లీజులు, రవాణా, సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌ను రిసెప్షన్ బాధ్యతల నుంచి తప్పించారు. కేవలం సెంట్రల్ స్టోర్స్ మాత్రమే చూడాలన్నారు. కె.సూర్యనారాయణకు రవాణా, జె.రామకృష్ణకు అన్నదానం, ఎంవీకే సుబ్రహ్మణ్యానికి ఆలయ రిసెప్షన్ విభాగాలు కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో గంటా విష్ణుకు రెండువేల వ్రతాలు, రిసెప్షన్, రికార్డ్ అసిస్టెంట్ సంగన వీర్రాజుకు 1500 వ్రతాలు కేటాయించారు. కోరుకొండ ఆలయ లెక్కల్లో అవకతవకలు ఆరోపణలు ఎదుర్కొన్న అనిల్‌కుమార్‌కు కంప్యూటర్ వర్క్, కొంతం సతీష్‌కు పరిపాలనా విభాగ బాధ్యతలు అప్పజెప్పారు.



డిస్క్‌త్రో చేస్తున్న దివ్యాంగ విద్యార్థి,



విజేతకు బహుమతి ప్రదానం

ఆటపాటలతో సందడి

కాకినాడలో వేడుకగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో విభిన్న ప్రతిభావంతులు సందడి చేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఇందుకు వేదికగా నిలిచింది. కాకినాడ జేఎన్టీయూ అలుమ్ని ఆడిటోరియంలో మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ పూర్తి అదనపు బాధ్యతల సహాయ సంచాలకుడు వీవీవీఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాల ఉమామనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడీ రామారావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ కో-ఆర్డినేటర్ సీహెచ్ సుబ్బారావు, అంధ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణికంఠస్వామి, ఆశ్రయ వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. విభిన్న ప్రతిభావంత విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, 351 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కోరుకొండ మండలం మధురపూడిలోని కన్నా ఆశ్రయ్ మానసిక దివ్యాంగుల కేంద్రం విద్యార్థులకు మొత్తం 12 బహుమతులు లభించాయి. విభిన్న ప్రతిభావంతులకు ఉత్తమ సేవలందిస్తున్న సంఘాల ప్రతినిధులు 34 మందిని, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ప్రత్యేక పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రతినిధులను సత్కరించారు. పులిమేరు శాంతివర్ధని స్పెషల్ పాఠశాల ప్రతినిధి, మహర్షి బులుసు సాంబమూర్తి పాఠశాల హెచ్‌ఎం, కాకినాడ ప్రభుత్వ బధిరుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సామర్లకోట సిరి స్పెషల్ పాఠశాల ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతుల సేవా సంస్థల ప్రతినిధులు జి.కొండలరావు, నిమ్మకాయల సురేష్, కొసన సత్య సుబ్రహ్మణ్యం, బీవీవీ సత్యనారాయణ, యు.శ్రీనివాస్, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు, సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛంద సంస్థ ప్రతినిధికి సత్కారం

ఘనంగా అయ్యప్ప పడి పూజ



18 మెట్లపై దీపాలు వెలిగించిన దృశ్యం

మోతుగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి తెల్లవారుజామున నాలుగు గంటలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సత్తిబాబు, జి.రవి సాయంతో మధ్యాహ్నం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. సాయంత్రం 18 కలశాలతో పడి పూజ ఘనంగా జరిగింది. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు దంపతులు, సీనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ వరప్రసాద్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెంటకోట సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన పూజలో అయ్యప్ప కమిటీ సభ్యులు టి.ప్రసాద్, పప్పు చిరంజీవి, జి.రవి, సత్తిబాబు, నాగేష్ రాజా, శ్రీను, భీమరాజు, పప్పు వెంకటేశులతో పాటు మోతుగూడెం, సీలేరు, డొంకరాయి, ఫోర్‌బై, పొల్లూరు, చింతూరు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంటకు చెందిన అనేక మంది స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

నేడు, రేపు రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికలు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4, 5 తేదీల్లో సామర్లకోట సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయంలో పోలింగ్ జరుగుతుందని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సామర్లకోట బ్రాంచి కార్యదర్శి ఎం.రమేష్ మంగళవారం రాత్రి తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది, సామర్లకోట బ్రాంచి పరిధిలో అటు కేశవరం నుంచి ఇటు హంసవరం వరకు గల సుమారు 650 మంది రైల్వే కార్మికులను బరిలో ఉన్న వివిధ కార్మిక యూనియన్ల నాయకులు కలిసి తమ సంఘాన్ని బలపరచాల్సిందిగా అభ్యర్థించారు. రైల్వే కార్మికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకం అయిన ఈ గుర్తింపు ఎన్నికల్లో ఆధిపత్యం నిరూపించుకునేందుకు పోటీ హోరాహోరీగా సాగనుంది. ఈ నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రమణీయం...

శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

వైభవంగా శ్రీయాగ సహిత సుదర్శన నారసింహ యాగం

కాకినాడ భానుగుడి సెంటరు నుంచి వేలాది మంది భక్తులతో శోభాయాత్ర



సర్పవరం జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని పాలకులు సుభిక్షమైన పాలన అందించి, ప్రగతి పథంలో పయనింపచేసేందుకు కృషి చేయాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయరు స్వామి పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ జేఎన్టీయూ ఎదురుగా గల మైదానంలో శ్రీరామ సేవా సమితి, వికాస తరంగిణి, శ్రీవారాహి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. వారం పాటు నిర్వహించే విశ్వశాంతి శ్రీయాగ సహిత సుదర్శన నారసింహ యాగాన్ని వైభవంగా ప్రారంభించారు. వేలాదిగా హాజరైన భక్తులకు జీయరు స్వామి అనుగ్రహభాషణ చేశారు. శ్రీరామచంద్రుడు మానవత్వం, సేవాతత్పరతతో సమాజ అభివృద్ధికి ఇతోధిక కృషి చేశారన్నారు. కులమతాలకతీతంగా సమస్త జనులపై ప్రేమ, వాత్సల్యం చూపించిన మహనీయుడు శ్రీరాముడు అన్నారు. సత్యవ్రతుడైన శ్రీరాముడు భరతుని కోరిక తిరస్కరించగా, శ్రీరామ పాదుకలనాశ్రయించిన భరతుడు రామరాజ్యాన్ని తరించాడన్నారు. సర్వమానవాళి దోషాలను తొలగించే విధంగా శాంతి, సమాజ శ్రేయస్సులను ప్రజలకు అందించి పాదుకా పట్టాభిషేకం తలపెట్టారన్నారు. శ్రీరామ పాదుకారాధన వైభవాన్ని భరతుడు లోకానికి చాటగా, రామ పాదుకా మహిమను ఎందరో విశిష్టంగా కొనియాడారన్నారు. శ్రీరామ పాదుకల విశిష్టత, చరిత్ర ఘట్టాలను రామాయణ సంస్కృత శ్లోకాలతో వివరించారు. తొలుత చినజీయరు స్వామి స్వీయ పర్యవేక్షణలో కాకినాడ భానుగుడి సెంటరు నుంచి జేఎన్టీయూ ప్రాంగణానికి వేలాది మంది భక్తులతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ్‌నారాయణ్ పెరుమాళ్ పీఠాధిపతి శృంగారం తిరువేంగళ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



చినజీయరు స్వామి భాషణను వింటున్న భక్తులు

కాకినాడ పోర్టులో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

విజయవాడ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండేందుకు అందరూ సహకరించాలని విజయవాడ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేని పీడీఎస్ బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రవాణా చేయకుండా ఎగుమతి, దిగుమతి దారులు, ఛాంబర్ ప్రతినిధులు, ఏజెంట్లు వ్యాపారులు సహకరించాలన్నారు. మంగళవారం కాకినాడ కస్టమ్స్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు.అయన మాట్లాడుతూ కాకినాడ ఓడరేవులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 24గంటలు పనిచేసేలా ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ వివిధ వాహనాల ద్వారా సరఫరా అయ్యే సరుకులు పౌరసర ఫరాలశాఖ నుంచి నిరభ్యంతక పత్రం, బిల్లులు తీసుకున్న తర్వాతే ఎగుమతికి అనుమతించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణరాజు యాదవ్, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, ఎసీసీ జీ.నాయుడు, ఎంకరేజ్ ఆఫీసర్ ధర్మశాస్త్ర, జిల్లా రైస్ ఎగుమ తిదారుల సంఘం అధ్యక్షుడు బీవీ కృష్ణారావు, స్టీవ్ డోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

రూ.3లక్షల నగదు, 48గ్రాముల బంగారం స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రూ.3లక్షల నగదు, 48గ్రాములు బంగారం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ కేసు వివరాలను వెల్లడించారు. చొప్పెల్ల గ్రామంలో విశ్వనాధుల వీరభద్రరావు ఇంట్లో నవంబరు 25న రాత్రి దొంగతనం జరిగింది. వీరభద్రరావు 26న పోలీసులకు ఫి ర్యాదు చేశారు. రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రాము ఆధ్వర్యంలో జరిగిన విచారణలో ఈనెల 3న సీఐ విద్యాసాగర్ చొప్పెల్ల సెంటర్లో ఇద్దరు నిందితులను రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలుకు చెందిన తమ్మ వినోద్‌కుమార్, ఏలూరు పవన్‌కళ్యాణ్‌ను అరెస్టు చేసి విచారించారు. వారి నుంచి రూ.3లక్షల నగదు, 48గ్రాముల బంగారు నక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆలమూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ రాము కేసు నమోదు చేశారు. ఈ కేసు ఛేదించడంతో కీలకంగా నిలిచిన కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ అశోక్, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రాము, ఇబ్బంది ఎస్.టైసన్, పి.గంగాధర్, బి. నెహ్రూ, బి.శ్రీనివాసరావు, సీహెచ్.దుర్గాప్రసాద్, పి.రాజు, కెవీ.రవికుమార్‌లను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

తాటిపాకలో పట్టపగలే చోరీ

17 కాసుల బంగారం.. అర కిలో వెండి, రూ.లక్షా 10వేల నగదు దొంగతనం


తాటిపాకలో చోరీ జరిగిన ఇంట్లోని బీరువాను పరిశీలిస్తున్న రాజోలు ఎస్‌ఐ రాజేష్‌కుమార్

రాజోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాక సెంటర్‌లో గుబ్బల తాతారావుకు చెందిన ఇంట్లోకి సోమవారం సాయంత్రం దొంగలు చొరబడి 17 కాసుల బంగారం, అరకిలో వెండి, రూ.లక్షా 10వేల నగదు మొత్తం రూ.4లక్షల 70 వేలు సొత్తును దోచుకువెళ్లారని రాజోలు ఎస్‌ఐ బి. రాజేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం... తాటిపాక సెంటర్‌లో తాతారావు తూకం దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం ఎదురుగా ఉన్న రోడ్డు గల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇంటికి తాళం వేసి యథావిధిగా సోమవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ దుకాణానికి వచ్చారు. మళ్లీసాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా బీరువా పగులకొట్టి, దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వెంటనే తాతారావు రాజోలు పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ రాజేష్‌కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. తాతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఏపీటీలో పాలీటెక్ ఫెస్ట్ ప్రారంభం

కాకినాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని నైపుణ్యాల ప్రదర్శనకు టెక్ ఫెస్ట్ చక్కని వేదికని జేఎన్టీయూకేలోని యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు అన్నారు. కాకినాడ ఏపీటీలో నిర్వహించిన ప్రాంతీయ పాలీటెక్ ఫెస్ట్-2024ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జనార్థనరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మోహన్‌రావు, గౌరవ అతిథులుగా కేఎస్‌పీఎల్ డీజీఎం పి.రవికుమార్, రామసత్యనారాయణ, సురేష్ హాజరయ్యారు. సాంకేతిక విద్యా శాఖ, ఏపీప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల 20 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 117 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కాకినాడ జిల్లాలో గల 21 మండలాల నుంచి పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలను తిలకించారు. పాలీటెక్ ఫెస్ట్ బుధవారం కూడా కొనసాగనుందని ప్రిన్సిపాల్ తెలిపారు.


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

రాజానగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం నమ్ముకున్న ట్రాక్టరే మృత్యుశకటమైంది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురంలో పొలంలో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ తిరగబడి డ్రైవర్ మృతిచెందాడు. గ్రామానికి చెందిన వెలుగుల శివ(31) గ్రామంలో దాళ్వా సీజన్‌కు సంబంధించి మంగళవారం దమ్ము చేస్తూ ట్రాక్టర్ గట్టు ఎక్కుతుండగా వెనక్కి తిరబడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో శివ బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందాడు. దీనికి తోడు ట్రాక్టర్ ట్యాంకులోని వేడెక్కిపోయిన డీజిల్ కూడా డ్రైవర్ శరీరంపై పడడంతో ఒళ్లంతా గాయాలయ్యాయి. ప్రొక్లెయినర్ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి బయటకు తీసేసరికి శివ అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా శివకు భార్య, ఓ బాబు, పాప ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మనోహర్ తెలిపారు.


సంఘటనా స్థలంలో మృతి చెందిన డ్రైవర్ శివ

రుడాకు కొత్త మాస్టర్ ప్లాన్

- 3వేల చదరపు మీటర్ల మేర అమలు యోచన
- పుష్కరాల నాటికి రివర్‌ఫ్రంట్ సుందరీకరణ
- ఈనెల 31 నుంచి భవన అనుమతులు సులభతరం
- ఆంధ్రజ్యోతితో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రయత్నాలు ప్రారంభించాం. గుడా ఉండగా సుమారు 200 చదరపుకిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. కానీ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రుడా పరిధిలోని మొత్తం ఏరియాను కలుపుతూ సుమారు 3 వేల చదరపు కిలోమీటర్లు కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నట్టు రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. దేశంలోనే మంచి ఎక్స్‌పర్ట్‌లైన కన్సల్టెన్సీలతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. రుడా పరిధిలో తూర్పుగోదావరి జిల్లాతో పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లోని కొంతభాగం, రామచంద్రపురం టౌన్ కూడా ఉందన్నారు. మొత్తం ఏరియాని అర్బనీకరించే విధంగా విశాలమైన రోడ్లు, వాన నీరు ఎక్కడా నిల్వలేకుండా ఉండడం కోసం స్టార్మ్‌వాటర్ డ్రైనేజీ సిస్టమ్, గ్రామాల్లో కూడా పారిశుధ్య సమస్యలు లేకుండా చూడడం కోసం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌ను మండల పరిధిలోకానీ,నియోజకవర్గ పరిధిలో కానీ చేసేట ట్లు ఉంటే బాగుంటుందనే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మంచినీటి సరఫరా కూడా అన్ని ప్రాంతాలకు ఉండే విధంగా ఈ మాస్టర్‌ప్లాన్‌లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పార్కులు, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పేదల కోసం వెల్ఫేర్ హౌసింగ్, మధ్య తరగతి ఇతర వర్గాలకు ఎఫర్డబుల్ హౌసి ంగ్, ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌కు అనుకూలంగా మాస్టర్ ప్లాన్ ఉంటుందన్నారు. హౌసింగ్ ఇతర సౌకర్యాలను రుడా, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో రూపొందించనున్నట్టు స్పష్టం చేశారు. రుడా ద్వారా ప్రజల ఇళ్లు, ఇతర నిర్మాణాల విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని, ఈ నెల 31 నుంచి జీ ప్లస్ 5 అంతస్తుల వరకూ ఎవరు భవనాలు నిర్మించుకున్నా ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగన వసరం లేదన్నారు. లైసెన్స్ సర్వేయర్‌తో ప్లాన్ గీయించుకుని.. ఆన్‌లైన్‌లో పెడితే అదే డీమ్డ్ అప్రూవల్ అవుతుందన్నారు. పనులు ఆరంభించే టప్పుడు రుడా, ఆర్ఎంసీ సిబ్బంది ఎవరైనా వచ్చి పరిశీలించి ఎన్‌వోసీ ఇస్తారన్నారు. ఇక ఎవరి ప్రమేయం లేకుండా కట్టడం నిర్మించుకోవచ్చని చెప్పారు. రుడా ద్వారా ప్రభు త్వానికి ఆదాయం వచ్చే మార్గాలు పరిశీలిస్తున్నామని, ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతోపాటు పార్కుల వద్ద షాపులు నిర్మిస్తామన్నారు. వీటి అద్దెల ద్వారా ఆదాయం వస్తుందని చెప్పారు. మినీ సోలార్ ప్లాంట్లు నిర్మించే ఆలోచన ఉందన్నారు.


రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

అన్ని ప్రాంతాల్లో సుందరీకరణ..

2027లో వచ్చే గోదావరి పుష్కరాల నాటికి గోదావరిని అనుకుని ఉన్న అన్ని ప్రాంతాల్లో రివర్‌ఫ్రంట్ సుందరీకరణ చేస్తామని చైర్మన్ తెలిపారు. రాజమహేంద్రవరం సిటీలో పర్వాలేదని, దానితో పాటు రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే మొత్తం రివర్‌ఫ్రంట్‌ను సుందరీకరించి..కనీసం సైకిల్ వాక్‌కు అనుకూలంగా ఉండేటట్టే చేసే ఆలోచన ఉందన్నారు. రుడా పరిధిలో గత ప్రభుత్వంలో చేసిన పనుల నిర్వహణ ఎవరనేది స్పష్టత లేదని, అనేక గ్రామాల్లో జిమ్‌లు నిర్మించినా నిర్వహణ బాధ్యత ఎవరికీ అప్పగించకుండా వది లేశారన్నారు. తాము దీర్ఘకాలిక ప్రయోజనంతో పాటు నిర్వహణ కూడా ఉండే పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు స్పష్టంచేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మీటింగ్ పెట్టి గతంలో అనుమతుల్లేకుండా కట్టిన కట్టడాలు, వచ్చే ఆదాయం వంటి వాటిపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

కీచక ఉపాధ్యాయులు!

- నాగుల్లంకలో విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు
- సండే స్కూలు టీచర్ వద్ద విషయం బయటపెట్టిన విద్యార్థినులు
- ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, స్థానికులు
- బొమ్మూరులో బాలికను లైంగికంగా వేధించిన హిందీ ఉపాధ్యాయుడి అరెస్ట్


నాగుల్లంకలో ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేస్తున్న తల్లిదండ్రులు, పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

పి.గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతూ తండ్రి స్థానంలో ఉండవల్సిన ఉపాధ్యాయుడు గురువు అనే పదానికే మాయని మచ్చ తెచ్చాడు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతూ తన వెకిలి చేష్టలతో పిల్లలను ఇబ్బందిపెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్న ఆ ఉపాధ్యాయుడికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక ప్రాథమిక పాఠశాలలో జరిగింది. విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..... రాజోలు మండలం మెరకపాలెం గ్రామానికి చెందిన పిండి శ్రీనివాస్ ఎంటీఎస్ (మినిమమ్ టైమ్ స్కేలు) ఉపాధ్యాయుడిగా మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పొన్నమండతో పాటు పి.గన్నవరం మండలంలోని ముంగండ, జొన్నల్లంక ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసి సెప్టెంబరు 11న నాగుల్లంక ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరాడు. 1,2 తరగతులకు హెచ్ఎం కె.గంగాభవానితో పాటు శ్రీనివాస్ పాఠాలు చెప్పేవాడు. అయితే హైస్కూల్లో తరగతి గదులు లేకపోవడంతో 3,4,5 తరగతులకు ప్రాథమిక పాఠశాలలోనే పాఠాలు చెప్తున్నారు. ఈక్రమంలో గ్రామంలో సండే స్కూలు నిర్వహిస్తున్న చవ్వాకుల వల్లి ప్రతీ వారం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తుంది. అయితే ఈనెల 2వ తేదీన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చెప్తున్న సమయంలో మా స్కూల్లో ఉపాధ్యాయుడు బ్యాడ్ టచ్‌లు చేస్తున్నాడు అంటూ ఓ విద్యార్థి సండే స్కూలు టీచర్ దృష్టికి తీసుకువచ్చింది. అసలు ఉపాధ్యాయుడు ఎలా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులను వల్లి ఆరా తీయగా ఉపాధ్యాయుడు చేస్తున్న చేష్టలను ఒక్కొక్కటిగా వివరించారు. విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు చేరడంతో హెచ్ఎం గంగాభవానిని నిలదీశారు. దీంతో స్థానిక మహిళ పోలీసు, మండల విద్యాశాఖ అధికారిణి కె.హెలీనా పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఆ కీచక ఉపాధ్యాయుడు ఆరుగురు విద్యార్థులపై చేసిన వికృత చేష్టలు సైతం బయటపడ్డాయి. పైగా విద్యార్థులే మీద పడేవారని, ఆ సమయంలో తగిలి ఉండవచ్చునని ఉపాధ్యాయుడు సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. అంతేకాకుండా ఈ కీచకుడు బాగోతాలను ప్రత్యక్షంగా పాఠశాలలో ఆయా చూసి హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. అలాగే విద్యార్థులకు డబ్బులు ఎరగా చూపి మచ్చిక చేసుకునేవాడని విచారణలో బయటకు వచ్చాయి.

ఇదిలా ఉండగా ఆవేదనతో రగిలిపోతున్న విద్యార్థులు తల్లిదండ్రులు, స్థానిక యువకులు ఉపాధ్యాయుడికి పలుమార్లు దేహశుద్ధి చేశారు. పోలీసులు జోక్యంతో స్థానికులు శాంతించగా పాఠశాలకు చేరుకున్న అంబాజీపేట ఎస్‌ఐ కె.చిరంజీవి సిబ్బందితో ఉపాధ్యాయుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని, విద్యార్థుల వాంగ్మూలం నమోదు చేయడంతో పాటు తల్లిదండ్రుల ఫిర్యాదును స్వీకరించి విషయాన్ని డీఈవో షేక్ సలీంబాషాకు తెలియజేసినట్టు ఎంఈవో కె.హెలీనా తెలిపారు. ఈ విచారణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వెంకటలక్ష్మి, మహిళా పోలీసు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న ఉపాధ్యాయుడి అరెస్టు

పోక్సో కేసు నమోదు


అరెస్ట్ అయిన ఉపాధ్యాయుడు సత్యనారాయణ

ధవళేశ్వరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరులో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో బాలికను లైంగికంగా వేధించిన హిందీ ఉపాధ్యాయుడు తంగేటి సత్యనారాయణపై ధవళేశ్వరం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సీఐ టి.గణేష్ మంగళవారం సత్యనారాయణను అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించింది.

శివోహం

పిఠాపురంలో వైభవంగా శివస్వాముల నగరోత్సవం


పిఠాపురంలో రథాన్ని లాగుతున్న దృశ్యం

పిఠాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వాముల శివనామస్మరణతో కాకినాడ జిల్లా పిఠాపురం మార్మోగింది. శివస్వాముల నగరోత్సవం వైభవంగా జరిగింది. శివమాల ధరించి దీక్ష పూర్తి చేసిన స్వాములకు మంగళవారం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో ఇరుముడిధారణ జరిగింది. అర్చక, గురుస్వాములు స్వాములను ఇరుముడి ధరింపచేశారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో శివస్వాముల నగరోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి వీధుల్లో లాగారు. రథోత్సవాన్ని పాదగయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ప్రార ంభించారు. కొంతదూరం స్వామి రథాన్ని లాగారు. అనంతరం శివనామస్మరణ చేసుకుంటూ డప్పులు వాయిద్యాలతో ముందుండగా పట్టణంలో శివస్వాములు ప్రదర్శనగా తిరిగారు.


నగరోత్సవంలో పాల్గొన్న శివస్వాములు

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

- మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు
- ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని మున్సిపల్ ఆర్డీ సీహెచ్. నాగ నరసింహారావు అన్నారు. మంగళవారం రామచంద్రపురం పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి సమస్యలు మన దృష్టికి తీసుకువచ్చినా వాటికి పరిష్కారం చూపే బాధ్యత అందరిపైన ఉందన్నారు. ప్రజా సమస్యలు సామరస్యధోరణిలో స్వీకరించి వాటికి పరిష్కారం సాధ్యమైనంత త్వరగా చూపితే ప్రజల్లో పురపాలక సంఘాల పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. తడిచెత్త పొడి చెత్త రీసైక్లింగ్ చేయడం కారణంగా పురపాలక సంఘానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కంపోస్టు యార్డు స్థలాలు కూడా సరిపోతాయన్నారు. లేకపోతే కంపోస్టు యార్డు ఎంత స్థలం ఉన్నా సరిపోదన్నారు. పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉంటున్న తరుణంలో ఆదివారం పారిశుధ్య కార్మికులు, శానిటరీ కార్యదర్శులను ఉపయోగించుకుని బదులుగా వారికి అవసరమైన రోజు సెలవులు మంజూరు చేయాలన్నారు. వీలును బట్టి సిబ్బందిని సర్దుబాటు చేయాలన్నారు. పురపాలనకు సంబంధించి ఆస్తిపన్నులు వసూలు, పన్నులు విధింపు, పారిశుధ్యం, లిక్విడ్‌వేస్ట్ మేనేజ్‌మెంటు, సోలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంటు, పీకల్ స్ట్రక్చర్ మేనేజుమెంటు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతర అభివృద్ధి పనులు, ఇతర విషయాలపై అంశాల వారీగా పురపాలక సంఘాలపై అధికారులతో సమీక్ష చేశారు. రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు, డీఈ శ్రీకాంత్, సూపరింటెండెంట్ జి.రాధాకృష్ణ, మండపేట, అమలాపురం, మండపేట, కొవ్వూరు, నిడదవోలు కమిషన్లు, ముమ్మిడివరం కమిషనర్, పురపాలక సంఘాల అన్ని విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యను పరిష్కరించే వరకు పోరాటం'

గోకవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ బాధితుల సమస్యను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని సామాజిక ఉద్యమనేత పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. గ్రామంలోని దళితవాడలో అస్సాగో బాధితులను మంగళవారం ఆయన, తన సతీమణి శ్రీదేవితో కలిసి పరామర్శించారు. సూర్యచంద్ర మాట్లాడుతూ పరిశ్రమ నుంచి వెలువడే వాయు, శబ్ద, జల కాలుష్యాలను నియంత్రించాలని 3నెలలుగా ప్రజలు నిరసనలు తెలియజేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం, పైగా 144సెక్షన్ విధించి గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. సమస్యను పూర్తిగా పరిష్కరించేవరకు ప్రజల తరుపున తన పోరాటం ఆగదన్నారు. దీనిలో భాగంగా ప్రతీ ఇంటి వద్ద ప్రభుత్వానికి తెలిసేలా నల్ల జెండాను ఏర్పాటు చేయాలని బాధిత గ్రామాల ప్రజలకు సూర్యచంద్ర పిలుపునిచ్చారు. సూర్యచంద్ర దంపతుల వద్దకు పోలీసులు చేరుకుని శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో సమావేశాలు, సభలు ఏర్పాటు చేయరాదని సూచించారు. జగ్గంపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి మరొతి శివగణేష్ గ్రామంలోకి వస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా గ్రామంలో 144 సెక్షన్‌ను అతిక్రమించిన సూర్యచంద్ర, శివగణేష్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.


జగ్గంపేట కాంగ్రెస్ ఇన్‌చార్జిని అడ్డుకున్న పోలీసులు

ఏజెన్సీలో పులి కలకలం!

- రెండు మేకలను హతమార్చిందని అంటున్న గిరిజనులు
- ప్రజలను అప్రమత్తం చేసిన అటవీశాఖ అధికారులు
- పాదముద్రల ఆధారంగా గుర్తించే ప్రయత్నం


అధికారులు గుర్తించిన పాద ముద్రలు

రాజవొమ్మంగి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో చాలా రోజుల తరువాత పులి సంచరిస్తుందనే సమాచారం గిరిజన ప్రాంత ప్రజల్లో కలకలం రేపింది. మండలంలోని గడువకుర్తి పంచాయతిలో సోమవారం మేకల మందపై పులి దాడి చేసి రెండు మేకలను హతమార్చిందని గిరిజనులు చెపుతున్నారు. ఆ సమాచారం మేరకు సోమవారం రాత్రి, మంగళవారం అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని క్షుణంగా పరిశీలించారు. దోనెలపాలం-గొబ్బిలమడుగు గ్రామాల మార్గమధ్యంలో గండిపై పులి స్థావరంగా ఏర్పాటు చేసుకుని నిత్యం అక్కడే ఉంటుందని, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు అదే గండిపై కూర్చొని ఉందని ప్రజలు చెపుతున్నారు. మంగళవారం ఆ ప్రాంతాన్ని అటవీశాఖ రేంజ్ అధికారి ఉషారాణి సిబ్బందితో కలిసి పరిశీలించారు. పాదముద్రలను అధికారులు గుర్తించి కొలతలు తీసుకున్నారు. పులిని చూశామని చెపుతున్న వారి నుంచి అధికారులు వివరాలు సేకరించారు. ఉషారాణి మాట్లడుతూ అటవీ జంతువు ఈ ప్రాంతంలో తిరిగినట్టు పాదముద్రలు ఉన్నాయని, ఏ జంతువు అనేది వాటి పాదముద్రల ఆధారంగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అవసరమైతే అనుమానాస్పద ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు పెడతామన్నారు. అలాగే గొబ్బిలమడుగు, లంగుపర్తి, దోనెల పాలెం సమీప గ్రామప్రజలు ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అయితే ఆ ప్రాంత ప్రజలు మాత్రం పులి సంచరిస్తుందనే విషయం తెలిసి భయభ్రాంతులకు గురవుతున్నారు.


పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అపరాధ రుసుం లేకుండా రేపటి వరకూ ఇంటర్ ఫీజు గడువు

ఇంటర్మీడియట్ బోర్డు తూర్పుగోదావరి జిల్లా పర్యవేక్షణాధికారి నరసింహం

రాజమహేంద్రవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మార్చి-2025 ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 5లోపు చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు తూర్పుగోదావరి జిల్లా పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాకినాడ

సీతారామపురంలో పారిశుధ్య పనులు

తాళ్లరేవు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ సీతారామపురంలో సర్పంచ్ పెయ్యల మంగేష్ ఆధ్వర్యంలో సంపూర్ణ పారిశుధ్య పనులను కార్యదర్శి విజెవి. రమణ మంగళవారం చేపట్టారు. దోమల నివారణకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సీతారామపురం, ప్రతాప్‌నగర్ గ్రామ వీధుల్లో పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం కావాలి

ఎమ్మెల్యే చినరాజప్ప


సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

పెద్దాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం చేసే దిశగా కార్యకర్తలు కృషిచేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట, పెద్దాపురం మండలం, సామర్లకోట మండలాల్లో కూటమి నేతలతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఎన్నికల ప్రక్రియ లేకుండా ఏకగ్రీవం చేసే దిశగా కృషిచేయాలన్నారు. ప్రతీ సంఘం ప్రతీ క్లస్టర్ ఇన్‌చార్జ్ దీనిపై దృష్టిసారించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాజా సూరిబాబురాజు, కొత్తెం వెంకటశ్రీనివాసరావు (కోటి) పాల్గొన్నారు. స్థానిక మరిడమ్మ దేవస్థానం ముందు భాగంలో నిర్మిస్తున్న శాశ్వత పందిరి నిర్మాణాలను చినరాజప్ప పరిశీలించారు. నిర్మాణం పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యం కోసం ఈ శాశ్వత పందిరి నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందని, వేగంగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

'అభివృద్ధి పనుల వివరాలు అందించండి'


కమిషనరుకు లేఖ అందజేస్తున్న టీడీపీ నేతలు

గొల్లప్రోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో నగరపంచాయతీ ద్వారా వైసీపీ హయాంలో 2023 ఏప్రిల్ 1నుంచి ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి పనులు, వివిధ పద్దుల ద్వారా చేసిన ఖర్చులు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు తదితర వివరాలు అందజేయాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ పనులు సక్రమంగా జరగలేదని, పనులు చేయకుండానే బిల్లులు చేశారని, పలు అంశాల్లో అధిక ధరలకు సామాగ్రి కొనుగోలు చేసి లక్షలాది రూపాయిల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మేరకు గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనరు రవికుమార్‌ను టీడీపీ నేతలు కలిసి పూర్తి సమాచారం కోరుతూ లేఖను అందజేశారు. వీధిలైట్లు కొనుగోలు, రిపేర్ల నిమిత్తం చేసిన వ్యయం, జగనన్న కాలనీకి వేసిన లైట్లు, వ్యయం, కాంట్రాక్టులు ఏ విధంగా ఇచ్చారు, కాంట్రాక్టర్లకు ఏ విధంగా పనులు ఇచ్చారు, వారికి జరిగిన చెల్లింపులు, మంచినీటి ట్యాంకర్లు, చెత్త ట్రాక్టర్ల వివరాలు, ఆశీలు పాటల వివరాలు అందజేయాలని వారు కోరారు. వారం రోజుల్లోగా వివరాలు అందజేయకుంటే మున్సిపల్ ఆర్డీకి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం పాల్గొన్నారు.

'అభివృద్ధి పథంలో నిలిపేందుకు పని చేయాలి'

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు పారిశ్రామిక, ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్ మల్లిబాబు కోరారు. కాకినాడ పోర్టు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపార, పారిశ్రామిక వేత్తలు, ట్రాన్స్‌పోర్ట్, ఎక్స్‌పోర్ట్ ప్రతినిధులతో మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పోలీసు, పరిశ్రమలు, రవాణా శాఖల అధికారులతో కలిసి ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రైనీ ఐపీఎస్ ఆర్.సుస్మిత, కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, రవాణా శాఖ డీటీసీ మురళీకృష్ణ, పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, ఇతర అధికారులు హాజరయ్యారు. పోర్టు పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపార, పారిశ్రామిక వేత్తలు, ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ మాట్లాడుతూ 307 చట్టప్రకారం పరిశ్రమలకు సంబంధించి రవాణా విషయంలో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ లారీ ఓనర్లు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాకినాడ పోర్టు కేంద్రంగా నిత్యం అనేక వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈ కార్యకలాపాలతో వేలాది మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కాకినాడ సీ పోర్ట్ సీఈవో మురళీధర్, జెమిని ఎడిబుల్ ఆయిల్ ఇతర పరిశ్రమల, సంస్థల ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్ట్, లారీ ఓనర్స్, ట్యాంకర్స్ మినీ గూడ్స్ వ్యాన్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు...

భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యాబోధన

- డీఈవో పిల్లి రమేష్
- ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం
- బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డీఈవో రమేష్, కరపలో విద్యార్థులకు బహుమతుల పంపిణీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యాబోధన అందించడం జరుగుతుందని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో పిల్లి రమేష్ కోరారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం వలసపాకల భవిత కేంద్రంలో పలు ప్రత్యేక ఆటల పోటీలు, నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులను ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించిందని, వారికి సహిత విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఎవరి పనులు వారు చేసుకునేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలు బడిలో భాగమేనని, వీరిని స్కూల్స్‌లో చేర్చుకుని సహిత విద్య అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించడం జరిగిందన్నారు. విద్యార్థులు నేర్చుకున్న విద్యా సామర్థ్యాలు, నైపుణ్యాలతో పాటూ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు హుషారుగా చేసి అలరించారు. ఇన్నర్ వీల్స్ ఆఫ్ కాకినాడ సంస్థ ప్రతినిధి లక్ష్మీ భవిత కేంద్రానికి ప్రింటర్‌ని డీఈవో చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సహిత విద్య కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు వేణుగోపాల్, ఏసుదాసు, హెచ్ఎం మూర్తి, భవిత ఇన్‌స్ట్రక్టర్స్ నాగలక్ష్మి, గణేష్‌లు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ): కాకినాడ భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో రవి ముఖ్యఅతిథిగా హాజరై విభిన్న ప్రతిభావంతుల గురించి వివరించారు. వారికి సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం అందించే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆటల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం పద్మావతి, ఐఈఆర్పీఎస్ ప్రసన్న, విజయలక్ష్మి, సీఆర్ఎంటి గంగాధర్ పాల్గొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నగరపాలక సంస్థ మెప్మా విభాగం ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణారావుపేట మార్కెట్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి మెప్మా పీడీ బి.ప్రియంవద, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ కె.శైలజ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విభిన్న ప్రతిభావంతులను, వారికి రుణాలు మంజూరు చేసిన బ్యాంకు మేనేజర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, యూపీఏ సెక్షన్ సతీష్, సీవో సునీత, ఆర్పీలు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: పట్టణంలోని భవిత సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. విభిన్నప్రతిభావంతులు ఎందులోనూ తక్కువ కాదని, తమ మేధోశక్తిని వినియోగించుకుంటే సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్న, ఎంఈవో శివప్రసాద్, స్పెషల్ ఎడ్యుకేటర్ గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: చొల్లంగి నిరీక్షణ ఆశ్రమంలో లవింగ్ హేండ్స్ డిజేబుల్ సొసైటీ అధ్యక్షురాలు బొడ్డు ఆశాజ్యోతి ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆశ్రమం వ్యవస్థాపకుడు బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల ప్రగతికై అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో ఆశ్రమంలో వృద్ధులు, అనాథలకు భోజన సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు.

పెద్దాపురం: దివ్యాంగులను ఆదరించాలని తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో డి.శ్రీలలిత అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. దివ్యాంగుల పట్ల ప్రేమ, ఆప్యాయతలతో నడుచుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో డీవైఈవో ప్రభాకరశర్మ, ఎంఈవో చౌదరి, భవిత నిర్వాహకులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కరప: దివ్యాంగులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని, చులకన భావంతో చూడరాదని ఎంఈవో -2 పి.సత్యనారాయణ కోరారు. కరప భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరప హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. వారికి ఎటువంటి అవసరం ఉన్నా తాను ముందు ఉంటానని హామీ ఇచ్చారు. పలు ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది కె.స్వాతి, ఎన్.మల్లేశ్వరి, వి రాయ్, డి.తనూజ, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

నెలాఖరులోగా వరినాట్లు పూర్తి చేసుకోవాలి


జల్లూరులో రైతులతో మాట్లాడుతున్న విజయకుమార్

పిఠాపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు బారిన పడకుండా, అపరాలు సాగుచేసుకునేందుకు వీలుగా నెలాఖరులోగా దాళ్వా వరినాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ సూచించారు. పిఠాపురం మండలం జల్లూరులో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కౌలురైతులు తప్పనిసరిగా తమ వివరాలను రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుత సార్వాలో వాతావరణ పరిస్థితులను గమనించుకుంటూ వరికోతలు, మాసూళ్ల పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ జ్యోతిర్మయి, వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి అచ్యుతరావు, జన

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు శిక్ష

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వాహనదారులకు రెండు రోజుల జైలుశిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్‌న్ డ్రైవ్ పరీక్షలు చేపట్టగా 10 మంది మద్యం తాగి బైక్‌లు డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించి రెండవ స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ముగ్గురు వాహనదారులకు తలో రెండేసి రోజుల జైలుశిక్షను విధిస్తూ న్యాయమూర్తి వి.నరసింహరావు తీర్పునిచ్చినట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు. ఏడుగురు వాహనదారులకు తలో రూ. 10 వేలు చొప్పున జరిమానా విధించారన్నారు.

8న ఏఐవైఎఫ్ మహాసభలు

పిఠాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) కాకినాడ జిల్లా తొలి మహాసభలు ఈ నెల 8వ తేదిన కాకినాడలో జరగనున్నాయి. ఈ సభలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పిఠాపురంలో సమాఖ్య ప్రతినిధులు ఆవిష్కరించారు. నిరుద్యోగ సమస్యతో పాటు యువజనులకు సంబంధించిన పలు అంశాలపై ఈ మహాసభలో చర్చించి కార్యాచరణ సిద్ధం చేయడం జరుగుతుందని, యువత ఈ మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి, నాయకులు బాలెం కిరణ్, సత్తిబాబు, శంకర్, విష్ణు ఉన్నారు.

బ్లాక్‌బోర్డుల అందజేత



పిఠాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాషిణి తెలిపారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు, విశ్రాంత ఉపాధ్యాయులు కేవీఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో దాతలు పది బ్లాక్‌బోర్డులను అందజేశారు. నూతన భవనంలోని తరగతి గదుల్లో వినియోగించనున్నట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. అభివృద్ధికి సహకరిస్తున్న సభ్యులు, ప్రసాద్, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

పిఠాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని గాలిగంగాలమ్మ గుడి వీధిలో పేకాట ఆడుతున్న వారిపై పట్టణ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి రూ.28,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల జాబితాలో తప్పుడు ఓట్ల నమోదుపై ఫిర్యాదు

సామర్లకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో కొందరు తప్పుడు ఓట్లను నమోదు చేసుకున్న ఉదంతపై జిల్లా ఉన్నతాధికారులకు మంగళవారం ఒక ఉపాధ్యాయ సంఘం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆయా పోటీదారులైన కొందరు అభ్యర్థులు అందించే తాయిలాలకు ఆశపడి కొందరు మేధావులుగా ప్రచారం చేసుకుంటున్న కొందరు వ్యక్తులు తప్పుడు విధానంలో ఓటు హక్కు పొందినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. సదరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందాలంటే ఓటరు ఉపాధ్యాయుడుగా పనిచే యాల్సి ఉంది. లేదా ఎయిడెడ్ పాఠశాల, ప్రభుత్వ కళాశాల, కాంట్రాక్ట్ పద్ధతిన జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఫ్యాకల్టీలకు మాత్రమే అర్హత ఉంది. అంతేగాక సదరు ఓటుహక్కు పొందే ఉద్యోగి తమ సంస్థలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ స్థాయి అధికారి ధ్రువీకరించాల్సి ఉంది. చేసే ఉద్యోగం సదరు ఓటుహక్కు కలిగిన వ్యక్తి ధ్రువపత్రాలు పరిశీలనలో లోపాల వల్లే తప్పుడు ఓట్లు నమోదైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఊరు ఒకటి, ఉండేది ఒకటి ఉద్యోగం మరొకటి అయినా తప్పుడు విధానంలో ఓటు హక్కు పొందడమే గాక విచారణకు వచ్చిన బీఎల్వోలకు సైతం తప్పుడు సమాచారం ఇవ్వడం మరీ విడ్డూరం అని తెలిపారు. సదరు అధికారులు దర్యాప్తు జరిపి ఓటు హక్కు తొలగించకపోతే పోలింగ్ సమయంలో చట్టరీత్యా అడ్డుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు సన్నద్ధం అవుతున్నామని ఉపాధ్యాయ సంఘాలు ఆ ఫిర్యాదు ద్వారా హెచ్చరించారు. ఈనేపథ్యంలో తప్పుడు ఓట్లపై నమోదుపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బీఎల్వోను తిరిగి విచారణ చేసి ధ్రువపత్రాల వాస్తవికతను పరిశీలించి నివేదికలు అందజేయాలని అధికారులు ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రొయ్యల శుద్ధి కంపెనీ సీజ్ చేయడం మంచి పరిణామం


మల్లాడి రాజేంద్రప్రసాద్

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం లంపకలోవ సమీపంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబానికి చెందిన రొయ్యల శుద్ధి కంపెనీ కాలుష్య నియంత్రణ మండలి సీజ్ చేయడం సమాజానికి మంచి పరిణామమని జనసేన పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి మల్లాడి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చట్టాలకు ఎవరూ అతీతులు కాదని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలకు, సమాజానికి నష్టం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా అధికారులు ఉపేక్షించరాద న్నారు. ద్వారంపూడి గత ప్రభుత్వం అండదండలు చూసుకుని రొయ్యల కంపెనీల ద్వారా తీవ్రంగా కాలుష్య నిబంధనలు ఉల్లంగించారన్నారు. ప్రధానంగా వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ రొయ్యల శుద్ధి కంపెనీలో కాలుష్య నియంత్రణ చట్టం నిబంధనలు ఉల్లంఘించి ఎటువంటి అనుమతులు లేకుండా 20టన్నుల ఐస్ ప్లాంట్ నిర్వహించారన్నారు. గ్రీన్ చానల్ లేకుండా ఉన్నట్లు అధికారులను మభ్యపెట్టి దందా చేసినా అప్పటి యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరించిందన్నారు. రొయ్యల శుద్ధి వ్యర్థాలను ఇష్టానుసారంగా బయటకు వదిలివేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇదే విధంగా కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న కర్మాగారాలు కాలుష్య నియంత్రణ మండలి చట్టం నిబంధనలు పాటించేలా అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకుని కాలుష్య వ్యర్థాలను అరికట్టాలని కోరారు. రొయ్యల శుద్ధి కంపెనీపై ఫిర్యాదు చేసిన వెంటనే ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పి కృష్ణయ్య స్పందించి చర్యలు తీసుకున్నారని రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

30టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

తాళ్లరేవు, డిశంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ లక్ష్మీగణపతి రైస్‌మిల్లు నుంచి 30 టన్నుల రేషన్‌బియ్యం లారీని చొల్లంగి వద్ద పట్టుకున్నట్లు కోరింగ ఎస్ఐ పి. సత్యనారాయణ మంగళవారం తెలిపారు. మండల సివిల్ సప్లయ్ అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 6ఎ కేసు నమోదుచేశారు. లారీని కోరింగ పోలీసు స్టేషన్‌వద్దకు తరలించారు. లారీ డ్రైవర్ కరుణాకర్‌పై క్రిమినల్ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలి

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భవిత విద్యా కేంద్రం ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న విద్యాసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.హిమమహేశ్వరి పేర్కొన్నారు. సామర్లకోట పట్టణ పరిధిలో భవిత విద్యాకేంద్రం ఆవరణలో మంగళవారం ఎంఈవో పి.పుల్లయ్య అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ దివ్యాంగుల అందరితోనూ కలిసి ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎంఈవో పుల్లయ్య మాట్లాడుతూ భవిత కేంద్రానికి తీసుకురావాలన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం


నగదు, నిత్యావసర సరుకులు అందిస్తున్న టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గ ం టీడీపీ కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులుగా మిగిలిన పెనుమర్తికి చెందిన గంధం వసంత కుటుంబానికి నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ ఇటీవల అగ్నిప్రమాదంలో ఇళ్లు అగ్నికిఆహుతై, సర్వస్వం కోల్పోయారన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఇంటి పునర్నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాశ్ గౌడ్, టీడీపీ నాయకులు భీమాబత్తుల సత్యనారాయణ, ఉబ్బిసెట్టి నారాయణరావు, గుదే లోవబుజ్జి, వానపల్లి వెంకటరమణ, కాకరపల్లి చలపతి, వాసంశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల హక్కులకు భంగం కలిగితే చర్యలు

పిఠాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు రాజ్యాంగపరంగా హక్కులు ఉన్నాయని, వారిని కించపరిచినట్లు మాట్లాడినా, అవమానపరిచినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి స్పష్టం చేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో భాగంగా పిఠాపురం పట్టణంలోని భవిత కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మానసిక వికలాంగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. దివ్యాంగులకు న్యాయశాఖ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, ఉపాధ్యక్షుడు ఎస్ఎం ఆలీ, న్యాయవాదులు కె.సత్యవాణి, బాదం ఈశ్వరబాబు, కొంగు నూకరాజు, శ్రీనివాస్, ఎంఈవో నారాయణదాసు, భవిత అధ్యాపకుడు రాజకుమార్, కొండేపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులు సీజ్

తాళ్లరేవు, డిశంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని అమలుచేస్తూ తాళ్లరేవు మండలంలో ఉన్న 6మద్యం షాపులను సీజ్‌చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్ మంగళవారం తెలిపారు. ఈనెల5వ తేదీ 4గంటల వరకుషాపులు తెరవబడవన్నారు.

ధాన్యం ఆరబోతలో రైతుల పాట్లు


సామర్లకోట చెరకు యార్డులో తేమతో ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా తుపాను వాతావరణంతో భయపడిన రైతులు మంగళవారం వాతావరణలో మార్పులు కారణంగా ఎండవాతావరణం ఏర్పడడంతో తేమతో ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు అహరహం శ్రమించారు. రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్న దానికి క్షేత్రస్థాయిలో సహాయ నిరాకరణలో అధికారుల తీరుకు ఎక్కడా పొంతన లేకపోవడంతో రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు తీవ్ర వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ పంట పెట్టుబడుల భారంతో సతమతమవుతున్న రైతులకు ప్రకృతి ఏమాత్రం కరుణించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట టీటీడీసీ ఆవరణలో వివిధ అంశాల్లో శిక్షణలు పొందుతున్న మహిళలకు జెండర్ అవేర్‌నెస్‌పై మంగళవారం అవగాహనా సదస్సు, ర్యాలీలు నిర్వహించారు. టీటీడీసీ జేడీఎం కిరణ్, స్థానిక హెడ్ కానిస్టేబుల్ రాజులు జెండర్ అవేర్‌నెస్‌పై, మహిళా చట్టాలపై వివరించారు. అనంతరం శిక్షణార్థులతో కలిసి టీటీడీసీ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు.

స్కౌట్స్, గైడ్స్ నూతన శాఖ ప్రారంభం



అతిథి ఎంవీవీఎస్‌తో స్కౌట్స్, గైడ్స్

కాకినాడ రూరల్,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాపరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల్లో స్కౌట్స్ గైడ్స్ నూతన శాఖను ఏర్పాటు చేశారు. 32మంది బాలికలతో గైడ్స్ కెప్టెన్ పి.పద్మ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిబాబా అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భారత్ స్కౌట్స్, గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులంతా స్కౌట్స్, గైడ్స్‌లో రాణించాలని సూచించారు. యూనిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమీషనర్ ఎస్ఎస్‌బేగం, స్కౌట్స్ ఏఎస్ఓసీ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు రామలక్ష్మి,సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆమె డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, సెక్టోరియల్, రూట్ అధికారులతో ఆమె మంగళవారం సమావేశం నిర్వహించారు. పెద్దాపురం డివిజన్ పరిధిలోని 899మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, 11పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పెద్దాపురంలో 156 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అలాగే ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల విజయవంతం నిర్వహించడానికి సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి, సెక్టోరియల్, రూట్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో చెందుర్తి విద్యార్థుల ప్రతిభ



జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన చెందుర్తి విద్యార్థులు, గైడ్ టీచర్ అవార్డు అందుకుంటున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి పోటీల్లో గొల్లప్రోలు మండలం చెందుర్తి మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచారు. నేషనల్ గ్రీన్‌కార్ప్స్ , జిల్లా విద్యాశాఖ ఆధ్వ ర్యంలో కాకినాడలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాల ఏడవ తరగతి విద్యార్థులు కె.అఖిలేష్, వై.సాయితేజలు చెత్త నుంచి సంపద విభాగంలో కోడిగుడ్ల చెత్త నుంచి ఎరువు తయారు చేయడం అంశాన్ని ప్రదర్శించారు. దీనికి జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. విద్యార్థులను, గైడ్ టీచర్‌గా వ్యవహరించిన పిల్లి గోవిందరాజులను జిల్లా ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఎంఈవో శివప్రసాద్, హెచ్ఎం సురేష్‌కుమార్, విద్యాకమిటీ చైర్మన్ జగ్గారపు శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

చిన్నారి తల్లిదండ్రులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ అందజేత

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ గ్రామానికి చెందిన చిన్నారి బొందు ఐశ్వర్య గుండె వైద్య చికిత్స నిమిత్తం చేయూత సంస్థ ద్వారా సేకరించిన విరాళాలను తల్లిదండ్రులకు అందజేశారు. గుండె సంబంధిత వ్యాధితో చిన్నారి ఇటీవల మరణించడంతో సేకరించిన విరాళాల మొత్తం రూ.70 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను తల్లిదండ్రులకు అందజేయడంతో పాటు ఐశ్వర్య సోదరుడి విద్యా బాధ్యతను తీసుకున్నారు. రోటరీ చేయూత భవన్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో చేయూత సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ రవికుమార్, కార్యదర్శి అలీమ్, వైద్య విభాగం ముఖ్య సలహాదారుడు డాక్టర్ త్రిమూర్తులు రాయుడు, రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ ఉదయభాను, కార్యదర్శి మాచారెడ్డి, నేతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

12న చినజీయరు స్వామి పర్యటన

ప్రత్తిపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఈ నెల 12న సీతానగరం ఆశ్రమాధిపతి త్రిదండి చినజీయరు స్వామి పర్యటనను విజయవంతం చేయాలని ఆంధ్ర భద్రాద్రి శ్రీరామనామ క్షేత్ర కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చాట్ల పుష్పారెడ్డి, తేజోమూర్తుల సుబ్రహ్మణ్యశర్మ, అనంతపల్లి శ్రీను, పత్రి రమణ, గోగుల వెంకటేశ్వరరావు, నాగ ఆంజనేయులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



ఏకలవ్య పాఠశాలలో భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో, అసిస్టెంట్ కలెక్టర్

'రోగులకు వైద్య సేవల్లో జాప్యం వద్దు'

వై.రామవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ప్రభుత్వాస్పత్రులకు వస్తున్న రోగులకు వైద్య సేవల్లో జాప్యం వద్దని, వైద్య పరీక్షలు చేసి వ్యాధులకు ఉచితంగా మందులు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ భావనతో కలిసి రాజవొమ్మంగి మండలం జడ్డంగి పీహెచ్‌సీ, వై.రామవరం సీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వై.రామవరంలో వైద్యులు, సిబ్బంది ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. గర్భిణులకు అందుతున్న వైద్య సౌకర్యాలను పరిశీలించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల భవనం, సిబ్బంది క్వార్టర్ నిర్మాణ పనులను తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. విద్యార్థినులతో ముచ్చటించి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వ మెనూను సక్రమంగా నిర్వహించాలన్నారు. గంగవరం మండలం కొత్తాడ గ్రామంలో గోకులం షెడ్లను పరిశీలించారు. వై.రామవరంలో తహసీల్దారు వేణుగోపాల్ ఆక్రమణ కొలతలు జరుపుతుండగా ఐటీడీఏ పీవో సందర్శించి పలు సూచనలు చేశారు. పర్యటనలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డీఈ నాగరాజు, ప్రిన్సిపాల్స్ రామకృష్ణ, భైరవ తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాడదాం'

చింతూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్న పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాడదామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కల్లేరులో మంగళవారం జరిగిన సీపీఎం తొమ్మిదవ మండల మహా సభకు హాజరైన ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును దుయ్యబట్టారు. ముంపు సర్వే తీరు అస్పష్టంగా ఉండడంతో నిర్వాసితులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిహారం చెల్లింపు విషయంలో వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురాలేకపోయాయన్నారు. జీవో నెం.3 విషయంలో ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు మేకల నాగేశ్వరరావు, సీసం సురేష్, పులి సంతోష్, ముర్రం రంగమ్మ, మల్లం సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



మండల మహాసభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఎంఈవో వ్యవహార శైలిపై డీఈవోకు ఫిర్యాదు

కూనవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూనవరం ఇన్‌చార్జి ఎంఈవో-1 లక్ష్మీనారాయణపై యూటీఎఫ్ మండల శాఖ డీఈవోకు ఫిర్యాదు చేసింది. డీఈవో బ్రహ్మజీ కూనవరం మండల పర్యటన సందర్భంగా గతంలో ఎంఈవోగా పని చేసిన లక్ష్మీనారాయణ ఉపాధ్యాయుల భీమా పాలసీకి సంబంధించి రూ.2,31,038 అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కూటూరు పాఠశాల నిధులను సైతం దారి మళ్లించారని, యూనిఫామ్ స్టిచింగ్‌కు సంబంధించి నిబంధనలకు విరుద్ధం తీర్మానం చేసి రూ.43,900 స్వాహా చేశారన్నారు. జడ్పీహెచ్ఎస్ కూనవరం కాంప్లెక్స్‌లో 2023- 14కు సంబంధించి టీఎల్ఎం మండల మేళా నిధులు రూ.10 వేలు స్వాహా చేశారన్నారు. దీనిపై ఎటువంటి విచారణ జరపలేదని, తక్షణం జరిపించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో యూటీఎఫ్ నాయకుడు కన్నారావు తదితరులు వున్నారు.



ఎంఈవోపై ఫిర్యాదు చేస్తున్న యూటీఎఫ్ నాయకుడు కన్నారావు

కళాశాల శాశ్వత భవనాలకు నిధులు మంజూరు చేయాలి

దేవీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల శాశ్వత భవనాలకు నిధులు మంజూరు చేయాలని ధవళేశ్వరం ఎల్ఎంసీ అధికారులకు ఆదివాసీ జేఏసీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, రంపచోడవరం పారా లీగల్ వలంటీర్ యలగాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, ఊట్ల శ్రీనువాసరెడ్డి, మడకం చంద్రరావుదొర, కొమరం బాపన్నదొర, తాటి వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎంసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

దివ్యాంగులు ధైర్యంగా ముందుకు సాగాలి

వీఆర్ పురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ధైర్యంగా ఉండి అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలని తహసీల్దారు సరస్వతి, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని ఏఎస్ డీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. దివ్యాంగులకు బస్ పాస్‌లు పంపిణీ చేశారు. కో-ఆర్డినేటర్ నెరుపటి రవి, నాట్పాన్ సంఘం సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు బస్ పాస్‌లు ఇస్తున్న దృశ్యం

బంకులో కల్తీ డీజిలు: ఆటో డ్రైవర్ల ఆందోళన

ఎటపాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపాకలో దాబా హోటళ్ల ఎదురుగా ఉన్న పాత బంకులో కల్తీ డీజిల్ విక్రయాలు జరిగాయని ఆటో డ్రైవర్లు ఆరోపించారు. పాడైన తమ ఆటోలకు నష్టపరిహారం చెల్లించాలని బంకు యాజమానిని నిలదీశారు. ఈ బంకులో గత నెల 20 నుంచి 30వ తేదీ వరకు కొందరు ఆటో డ్రైవర్లు డీజిల్ కొట్టించుకున్నారు. కొంతదూరం వెళ్లాక ఆటోలు ఆగిపోవడంతో డ్రైవర్లు కల్తీ విషయాన్ని గుర్తించి బంకు వద్దకు చేరుకున్నారు. కల్తీ అంశాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని బాధిత ఆటో డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. పాడైన ఇంజన్లు బాగు చేయాలంటే ఒక్కో ఆటోకు రూ.6-7వేలు అవుతుందని వారు లబోదిబోమంటున్నారు. కల్తీ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు కారం సుబ్బారావును వివరణ కోరగా... బంకులో కల్తీ జరిగిం దనే విషయం తెలిసిందన్నారు. ఆర్ఐ, వీఆర్వోలతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేయిస్తామని చెప్పారు.



బంకు వద్ద ఆటోలను నిలిపివేసిన దృశ్యం

'వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలి'

రంపచోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరా క్రాంతి పథం (వెలుగు)లో వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీడీ డేగలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రంపచోడవరం, దేవీపట్నం మండలాలకు చెందిన 50 మంది వీవోఏలకు గత 17 నెలలుగా వేతనాలు చెల్లించలేదని, తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆన్‌లైన్ సేవలు నిలుపుదల చేసి విధులను బహిష్కరిస్తామని చెప్పారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

జగ్గంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో హెచ్ఎం టీవీఎస్ రంగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎంఈవో-1 స్వామి, ఎంఈవో-2 సుబ్రహ్మణ్యేశ్వర రావు, సీడీపీవో పూర్ణిమ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కందుల వెంకట రామారావు, భవిత స్కూల్ టీచర్లు కనకదుర్గ, అప్పాన పెద్దకాపు, ఫిజియోథెరపిస్టు దివ్య మేఘన, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు బాలాజీ రెస్టారెంట్ చికెన్ బిర్యానీ పెట్టింది.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో నాతి బుజ్జి, ఎంఈవోలు సీహెచ్ నాయక్, కె.వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్‌బారి, బి.లవకుమార్, ఐఈఆర్‌పీ ఎస్.లోవ, ప్రకాశరావు, సీఆర్ఎంటీ ఎస్.లక్ష్మణరావు, తాతబాబు పాల్గొన్నారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలిచిన వారికి ఎంపీడీవో వెంకట నారాయణ బహుమతులు అందజేశారు. ఎంఈవో రామశేఖర్, రామకృష్ణ, సీఆర్పీ యర్ర శేఖర్, కమలకుమారి, నాగ గోవింద్, మన్నేస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవ సభకు ఎంఈవో వి.రాజబాబు అతిథిగా హాజరయ్యారు. చిన్నారులు శిక్షణ, ఫిజియోథెరపీ సద్వినియోగపరుచుకునేలా తల్లిదండ్రులు తోడ్పాటునందించాలన్నారు. ఎంఈవో-2 వై.అచ్చిరాజు, భవిత టీచర్ పి.కృష్ణ, సీఆర్పీలు మల్లేష్, రాంజీ ప్రసాద్, గంగారావు, బాషా పాల్గొన్నారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత సెంటర్లో దివ్యాంగ చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో షేక్ బాబ్జీ బహుమతులు అందజేశారు. ఎంఈవో-2 అనిశెట్టి సుబ్బిరెడ్డి, ఐఈఆర్టీలు జగన్నాథం, నాగేశ్వరరావు, హెచ్ఎం మహాలక్ష్మి పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): మండల వనరుల కేంద్రంలో ఎంఈవో గీతాదేవి అధ్యక్షతన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు శ్రీప్రకాష్, ఆర్యా, వివేకవర్ధని, సిద్ధార్థ, శ్రీచైతన్య స్కూలు విద్యార్థులకు లయన్స్ క్లబ్ తరపున బహుమతులు అందజేశారు. ఎంఈవో-2 రామకృష్ణ, ఐఈటీఎస్ఎస్ టీచర్ రామకొండబాబు, భవిత ఉపాధ్యాయులు రాంబాబు, శ్రీను, ఎంటీసీ సిబ్బంది పాల్గొన్నారు.



నాగేశ్వరరావుని అభినందిస్తున్న ఎమ్మెల్యే

డీఆర్‌యూసీసీ సభ్యునికి అభినందన

శంఖవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యునిగా నియమితుడైన గొర్లి నాగేశ్వరరావుని జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిశారు. నాగేశ్వరరావును ఆమె అభినందించారు. ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మూది నారాయణస్వామి పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక ఇస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, ఆయన మనుమడు అనీశ్

'భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూలును అభివృద్ధి చేయాలి'

జగ్గంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ఎడ్యుకేషనల్ హబ్, స్కిల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. మంగళవారం ఆయన అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్, డిగ్రీ, పీజీ, వెటర్నరీ కాలేజీ కూడా ఏర్పాటు చేయాలని, నర్సింగ్ కాలేజ్ 50 పడకల ఆసుపత్రి, యువతకు టెక్నికల్ స్కిల్ అందించే స్కిల్ యూనివర్సిటీ తీర్చిదిద్దాలని కోరారు. నెహ్రూ వెంట ఆయన మనుమడు అనీష్ నెహ్రూ వున్నారు.



చిన్నారులకు చాక్లెట్లు పంచుతున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొండబాబు

ఘనంగా బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి

జగ్గంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని స్థానిక డీఎస్‌టీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంఘ అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర, ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఏఎంటీ ఫిజియోథెపీ క్లినిక్ డాక్టర్ శ్రీరామ్మూర్తి, అలమండ తాతారావు, పడాల చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి సత్కారం

ఏలేశ్వరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్, కల్యాణ మండపం నూతన కార్యవర్గ అధ్యక్షుడు జ్యోతుల సత్యనారాయణ, కార్యదర్శి గొర్ల శివ, ఉపాధ్యక్షుడు వాకాడ కనకరాజు, సహాయ కార్యదర్శులు అట్టాడ ఆనందరావు, వడ్డాణపు లోవరాజులను పలువురు అభినందించారు. వారికి మాజీ కౌన్సిలర్లు సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, కావలి శ్రీను, చందక శేషు తదితరులు పుష్పమాలలు వేసి సత్కరించారు.



అల్లిపూడిలో 'పొలం పిలుస్తోంది'

కోటనందూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో రైతులు పంటలను ఒబ్బిడి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ కోరారు. మంగళవారం అల్లిపూడి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ప్రభుత్వం ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తోందని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అపరాల పంటకు ఇన్సూరెన్స్ వినియోగించుకోవాలని కోరారు. ఏఈవోలు కుమారి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రత్తిపాడు కో-ఆర్డినేటర్‌గా గిరిబాబు

ప్రత్తిపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం అధికారిక ప్రకటన విడుదలైంది. ఈ సందర్భంగా పలువురు గిరిబాబును కలిసి అభినందనలు తెలిపారు.



గిరిబాబును అభినందిస్తున్న వైసీపీ నాయకులు

అపరాల పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

తుని రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అపరాల పంటకు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఏఈవో పి.జగ్గఅప్పారావు కోరారు. వల్లూరు గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఇన్సూరెన్స్‌ను ఈ నెల 15వ తేదీలోపు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వీఈఏ భవాని రైతులకు అవగాహన కల్పించారు.

ఆదిత్యలో 'మేనేజ్‌మెంట్-స్ట్రాటజీ' అంశంపై సదస్సు

గండేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో మంగళవారం 'మేనేజ్‌మెంట్ -స్ట్రాటజీ' అంశంపై సదస్సు నిర్వహించినట్టు డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ వైస్ చాన్సలర్ పీఎస్‌జీ మలావి, మాజీ ప్రొఫెసర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కష్టపడే మనస్తత్వం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు వ్యూహాత్మక నాయకత్వ పాఠాలు, వృద్ధి వ్యూహాలు, స్థిరత్వ వ్యూహాలతో మేనేజ్‌మెంట్ విద్యలో ఉపయోగించే పద్ధతులను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయభార్గవి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపిన 9 మందికి జరిమానా

ప్రత్తిపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 9 మందికి రూ.10వేలు చొప్పున ప్రత్తిపాడు జడ్జి కాటం భాను జరిమానా విధించారని సీఐ పి.సూర్యఅప్పారావు మంగళవారం తెలిపారు. రౌతులపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒక వ్యక్తి రూ.10వేలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఆరుగురికి రూ.500 నుంచి రూ.3వేలు చొప్పున జరిమానా విధిస్తూ తుని మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

వాహనాల ముమ్మర తనిఖీలు

మోతుగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, చింతూరు సీఐ టి.దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్, స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డొంకరాయి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు.





పట్టుపురుగుల పెంపకందారులతో అమరావతి టీం సమావేశం

కూనవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిగూడెంలో పట్టుపురుగుల పెంపకందారులతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ అమరావతి టీమ్ సమావేశమైంది. వారికి తసర్ సిల్క్ ట్రైనింగ్ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు

గండేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లిలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పోతుల మోహనరావు మంగళవారం సభ్యత్వాలు నమోదు చేయించారు. ఇప్పటివరకు 6,600 సభ్యత్వాలు పూర్తి చేశామన్నారు. బొల్లంరెడ్డి రామకృష్ణ, తెలగరెడ్డి భద్రరావు, తలారి బాబూరావు, కలిమి శ్రీను తదతరులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు

దేవీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పజుల్లాబాద్ గ్రామంలో ఈనెల 7వ తేదీన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఏజెన్సీ గ్రా మాలతో పాటు మైదాన ప్రాంతాలు, గోకవరం తదితర చోట్ల భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

మావోయిస్టు వారోత్సవాలకు వ్యతిరేకంగా పోస్టర్లు



మోతుగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు వారోత్సవాలకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘంలోని యువకులు వై. రామవరం మండలం డొంకరాయి, చుట్టుప్రక్కల గ్రామాల్లో పోస్టర్లు అంటించారు. గిరిజనులకు ఉపయోగపడని వారోత్సవాలు వద్దన్నారు. మీ పాపాల్లో మాకు పాలుపంచవద్దని, మీదారికి రావాలని బెదిరించొద్దని, గిరిజనుల సహనం పరీక్షించొద్దన్నారు.



భజన గురువులకు సత్కారం

గండేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసమంతా భజన గురువులు వల్లభశెట్టి బుజ్జి, రామకుర్తి చినబాబు, తెలగరెడ్డి శ్రీనివాస్ భక్తి గీతాలతో నగర సంకీర్తన చేశారు. మంగళవారం వారిని కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కంచర్ల వెంకటేశులు, తెలగరెడ్డి భద్రరావు, ఇంటి సత్యనారాయణ, వల్లభశెట్టి ఆదినారాయణ, అక్కిరెడ్డి బాలాజీ, కాసుపు అప్పారావు, కొండేటి పెద్దకాపు, దార్లంక నూకరాజు, తెలగరెడ్డి ప్రకాష్, జాజిమొగ్గల సత్యనారాయణ, వల్లభశెట్టి వంశీ, వల్లభశెట్టి రమణ, అనుకుల రమణ, వల్లభశెట్టి బుజ్జి, అక్కిరెడ్డి వీరసత్యనారాయణ, వల్లభశెట్టి చిన్నరాజు, బత్తుల సత్తిబాబు, పంచికట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

జగ్గంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహించారు. ఆయన స్వయంగా పదార్థాలు వడ్డించగా 400 మంది భోజనం చేశారు. కార్యక్రమంలో రాజనాల శ్రీను, సూరపు రెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, దొడ్డా శ్రీను, అరినే రాజేష్, సింగులూరి రాందీపు తదితరులు పాల్గొన్నారు.



8న ఐలాజ్ మహాసభ

ఏలేశ్వరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన అన్నవరం శేషాద్రి సదన్‌లో ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర మొదటి మహా సభ జరగనుంది. దీని విజయవంతం కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఐలాజ్ కన్వీనర్ బుగతా శివ, సభ్యులు అవసరాల దేవి, జోగ ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలోని స్కిల్ హబ్ సెంటర్లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభించినట్లు పాయకరావు గవర్నమెంట్ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన పురుష, స్త్రీ అభ్యర్థులు అర్హులని... కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

17 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ప్రత్తిపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో 17 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు తహసీల్దారు ఎం.సూర్యప్రభ చెప్పారు. మంగళవారం లయన్స్ కమ్యూనిటీ హాలులో ఎన్నికల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో జరిగే ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఇరిగేషన్ ఏఈ ఇబ్రహీం, తాగునీటి సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక

తొండంగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం తొండంగి మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దారు, ఏఈఆర్వో మురార్జీ తెలిపారు. మండలంలో 61 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు ఆయన చెప్పారు. పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశామని, ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.